



# డామిట్! కథ అడ్డం తిరిగింది!



డామిట్! కథ అడ్డం తిరిగింది. ఇక్కడ ఇంటర్వెల్ పెట్టి తరువాత అడ్డం తిప్పి టెంపో మౌంట్‌చేసి క్లయిమాక్స్‌కి తోలీదామనుకుంటే -- దీం దుపంతెగ -- ఇక్కడే కాళ్లు బార జాపేసింది. షేక్స్ పియరన్నట్టు -- వాట్ టు డూ -- దట్, మైడియర్ వెంకటేశం, ఈజ్ ది క్వెశ్చన్!

ఏంవాయ్ క్వెశ్చన్‌మార్కు వాలకం పడింది? .... అదంతేలే. షేక్స్‌పియర్ అన్నవన్నీ బైహార్టు చెయ్యడంకన్న అనని నాలుగు ముక్కలూ ముక్కున తగిలించేసుకోడం ఈజీగా ఉంది. స్ట్రాటజీ మార్చుమని మేకియవిల్లీ ఊరకే అన్నాడుటోయ్! ఛస్తే అనడు. ఏదో లిటిగేష నుండబట్టే అన్నాడు.

గిరీశంగాడు కథ రాస్తున్నాడో లేదో చూస్చక్కా రమ్మని మీ మావ౯ పంపాడన్నాకు తెలుసు గాని .... చెప్పేది విను. అసలు ఫిలిం స్టోరీ రాయడం మజాకా కాదు. మీ నాన్న రొండిలోంచి రూపాయలేనా సుళువుగా ఒళిపొస్తాయిగాని అయిడియా లలాక్కాదు. కథనలా ఒదిలీసి జీవితంలో అరితేరినవాడి అనుభవసారం విను. బాగుపడు .... ఆ లోపల ఒక సిగారందుకో చెబుతా --

ఈ మధ్య యూరప్ నుండి రూరిటేనియా రాజావారొచ్చారు గదూ. ఒక్క గంట మాట్టాడాడో లేదో పొలిటీషియన్ల మురాని వెళ్ల గొట్టేసి, మిస్టర్ గిరీశం! సేవ్ మి ... .

ఓ! సేవ్ మి ఫ్రమ్ పొలిటీషియన్స్. నువ్వే నికార్సయిన పొలిటీషియన్‌వి. నిన్ను విడిచి ఒక్క గడియ కూడా ఉండలేను అన్నాడు--వాట్ టు డూ-- సరే శ్రీవారితో రూరిటేనియా వెళ్ళి రెస్టు తీసుకొన్నాం. ఏవిఁ గార్డెన్సు -- ఏవిఁ పాలెస్‌లూ-- అంతా మన నెక్స్ట్ పిక్చర్‌లో డ్రీం సీక్వెన్సులా ఉందంటే నమ్ము. అక్కడే ఇందాకటి డిస్కవరీ చేసింది . . . . . న్యూస్ పేపరు వాళ్ళున్నట్లు అందులో 'ఇన్ సైడ్ డోప్' యిస్తున్నా విను. మార్నింగ్ గార్డెన్‌లో ఆ పూట బ్రేక్‌ఫాస్ట్ చేస్తున్నాను -- నిన్నూ, బుచ్చమ్మనీ తల్చుకుంటూ -- నువ్వంటే ఎంత ఎంజాయ్ చేసేవాడివనీ -- చద్దివణ్ణం అనేది కొన్నాళ్ళయినా తిన్నందుకు షేమ్ షేమ్ అనుకునేవాడివి?

అంతలో వార్నింగ్ లేకుండా రాజావారు చక్కా వచ్చేసి కూచోబడి పోయారు. మిస్టర్ గిరీశం! యు హావే గెస్ట్ అంటూ. ఏఁవుంది, పెద్ద వాళ్ళతో మాట్లాడ్డం మజాకా అనుకున్నావా--మీ నాన్న దగ్గర మనిద్దరం గడగడా ఇంగ్లీషు మాట్టాడినట్టు కాదు. టాపిక్స్ హై లెవెల్‌లో ఉంటాయి. అంతా హై క్లాసాయె. వెధవది పరగడుపున టాప్ గేర్‌లో పడి దొరల భాషలో గుక్క తిప్పుకోకుండా ఫెడీ ఫెడీమని -- సినిమా వాళ్ళ ల్లా డైలాగ్స్ విసిరేసుకోడం మాటలా? ఆ మాటకొస్తే మాటలేగాని, దాన్నిగదరగా ఆ హ కొటేషన్‌లు దప్పళంలో గుమ్మడికాయ వంకాయ వగైరా ముక్కల్లా ఎగిరెగిరి పడ్డాయేమ -- యేది గుమ్మడికాయో, ఏది వంకాయో కూడా మర్చిపోయి--అలా తెల్లమొహం పెట్టకు, సిగ్గుచేటు. ఇది కవి సమయంలే -- ఆ కొటేషన్లు ఒకరి కొకరికి తగిలించేశాం -- అటు రాజావారు ఊహూ సిగ్గు పడిపోతున్నారు .... ఆ బట్లరు వెధవ రాజావారి వెనకాల తగలబడి ముసిముసి నవ్వులు నవ్వుతున్నాడు. ఇహ నాబోరు దక్కదని పసిగట్టి తమాయించుకునే సరికది పోనేపోయింది.

వెధవది ఎంతచెడ్డా అంత తెలీదుటోయ్, ఆ వెధవాయి అవలించక పోయినా పేగులెక్కెట్టేశ ను--హారినీ! గిరీశం! పరాయి దేశం వచ్చి తప్పులో కాలేశావోయ్. వాటెఫాల్ మై కంట్రీమన్ అనుకున్నా. సారీ .... అదిగో అదిగో చూశావా--అనాటి దెబ్బ తడాఖా? మళ్ళీ రాంగ్ కొటేషన్ పడింది.

తరువాత, మైడియర్ వెంకటేశం--మీ నాన్న నీ చేతో పూట అశనం నాగా పెట్టిస్తే ఎలాటి ప్రాఫౌండ్ థాట్స్ వస్తాయి? . . . . . అలాంటి వొచ్చాయి. రిపెంటెన్స్‌తో బాధపడి నా గది అంతా రిసెర్చి చేశాను పచార్లు కొడుతూ. చివరికి 'గిరీశం? నో యూజ్. . . మెమొరీ పవర్ స్లిప్పవుతోంది. ప్లేటు ఫిరాయించు, ఛేంజి ది టాక్టిక్స్.... అని తీర్మానించుకున్నాను. షేక్స్‌పియరుగారుగానీ, ఆయన ఫాదరేగానీ యెవడైనాసరే కొటేషను వాడకు. ఊరికే అనవసరప్పబ్లిసిటీ అఘోరించకు. యిచ్చినా ఆథరు పేరు చెప్పకు. కొటేషను వాడి బాబు సొమ్ము గాదుగా--వాడిసొమ్మే. అంచేత మనిష్టం. కాక వాడి పేరిట జమపడ్డవి నూటికి తొంబయి ఉన్నపుడు ఆ మిగతా పదీ బైహార్టు చేసి పారేస్తే బెస్ట్ గదా, సేఫ్టీ ఫస్ట్ అన్నాడు. ఫస్టెయిడు వాడు గాబోలు-- వీడు కాపోయినా ఫర్వాలేదు -- కాదనడుగా. కాబోలుననుకొని సంతోషిస్తాడు ముండావాడు పాపం . . . .

చెప్పొచ్చిందేవిఁటంటే, ఇదంతా కష్టపడి రీసెర్చిచేసి రాసి పారేసినట్టు ఏ రాయిటర్రిపోర్టరో ఇండియా చెవిలో ఊదేశాడు. మీ అంకులన్నట్టు వాడసాయెుం గూలా- అంతే ఏరోడ్రోములో దిగ్గానే యూనివర్శిటీల వాళ్ళు చుట్టుముట్టేసి మీ థీసిస్ మా కివ్వండంటే మా కివ్వండని పి.హెచ్. డీలు ఎర పెట్టారు.

మనం పుచ్చుకోలేదనుకో. నో అన్నాం ఖచ్చితంగా. షేమ్ అన్నాం ధైర్యంగా, సారీ అన్నాం క్రూరంగా.

ఇది నాకోసం కాదు. లోకకల్యాణం కోసం. మా బ్రదరిల్లా వెంకటేశంలాంటి వాళ్ళ కోసం, పాపం ఆ అమాయకులు తప్పుడు కొటేషనులు చెప్పి చెప్పుదెబ్బలూ, చీవాట్లూ తింటూ ఉంటే-- సినిమాలూ అవీ తీసి రాతాకోతా చేసి గుబ్బద్దలయేలా ఎడాపెడా ఫెడీ ఫెడీ విమర్శలు తింటూ ఉంటే -

వాళ్ళ సిస్టర్ బుచ్చమ్మ వెన్నలాటి సున్నితమైన హృదయం తమ్ముడి అవస్థ చూసి క్షోభపడిపోతూ ఉంటే నేను చూడలేను. చూసి భరించలేను. ఇంపాసిబుల్. అంచేత వాళ్ళకే ఈ థీసిస్ అంకితం చేస్తాను, ప్రచారం చేస్తాను, అని చెప్పి, ఆ జనం తెచ్చిన పి.హెచ్.డీ.లన్నిటినీ డీ డిక్కులు కొట్టుకోమని వదిలేసి చక్కా వచ్చా.

రేప్పొద్దున్న నువ్వు ప్రొడ్యూసరై, నేను డైరెక్టరై, మన డార్లింగ్ స్వీట్‌హార్ట్ బుచ్చమ్మ హీరోయినై పిక్చరు తీయబోతూఉండగా నేను ఇదంతా వదిలేసి, డిగ్రీలకోసం, సన్మానాలకోసం అలా ఊళ్ళ వెంట పడి పోడం-హౌ మాన్-హౌ ఇటీజ్ పాసిబుల్?

అంచేత అబ్బీ, అదీ కథ.

అన్నట్టు కథంటే జ్ఞాపకం వచ్చింది. ఇప్పుడు మనం నెక్స్‌ట్ పిక్చరు స్టోరీ మీంచేగా ఇంతదూరం వచ్చాం.వస్తే వచ్చాం గాని ఎంత ఎడ్యుకేషనోయి! దాన్నిగదరగ నీ మొహం ఎంత బ్రైటుగా ఉందో నీ కేమన్నా అజ తెలుస్తోందా అని -- అసలు నాతో మాటాడ్డమే ఓ ఎడ్యుకేషన్. కొందరితో మాట్టాడకపోవడమే ఎడ్యుకేషనైనట్టు. ఎవడు చెప్మా ఇంత బ్రిలియంట్ డైలాగన్నాడు! ఎవడేమిటి నేనే కాబోలు. అంతే నూటికి తొంభయి కొటేషనులు నావేగా. వాళ్ళు అవుటాఫ్ డేటై ఫేడౌటయిపోతున్నారు.

ఇంతకీ నీ బిక్కమొహం ఫేడౌట్ అయితేగాని కథ తెమలదు -- కబుర్లు లేకపోతే పనెలా జరుగుతుందోయి. అసలు కబుర్లు ఉన్నాయి కాబట్టే పనిని పని అన్నారు. ఇంత సేపు కబుర్లు చెప్పాం గాబట్టే ఇపుడు పని చూడాలి అని తెలిసింది గదా.

కథా కమామీషూ అని ఊరికే వచ్చిందిషోయ్! సినిమాలో కమామీషుతోటే ఉంది మరి కథంతా. అసలు కథంతా కలిపితే ఎంతటా టెలుగు ఫిలింస్‌లో -- వడ్లగింజలో అవగింజంత. మదరిల్లా అన్నట్టు -- యీ వెంపు మధురవాణీ ఆ వెంపు బుచ్చమ్మా నిలబడితే రెండు కళ్ళు చాలవు. కావలసినంత కథ. పనిగట్టుకు రాయడమెందుకు వేరే? వాటీజినె స్టోరీ! కథంటూ ఉంటే అడ్డమైనవాడూ దాన్ని దుయ్యబడతాడు. అంచేత మనకొద్దు. అజ్ఞానులంతా కథా కాకరకాయా అంటూ తన్నుకు చావనీ మనకేల?

ఇందులో ఒక గొప్ప సీక్రెట్ వుందిస్మీ. తెలుసుకో. అజ్ఞానులూ చాదస్తులూ ఉంటేనే మనం ధగా ధగా పైపై పోయేది, వాళ్లుంటేనే తిట్టే వాళ్ళు తిట్టగలిగేది.

తిట్లు తినిందికి ఎవడో ఒహడుంటేనే గదా తిట్టేవాడి ప్రతాపం వెలిగించి ప్రజ్ఞ పేల్చొచ్చు. సంస్కరణ జరపడానికి, పరిమార్చడానికి, మార్చడానికి చెత్తే గదా ముఖ్యం. విడో మారేజెస్ ద్వారా సివిలిజేషన్ పెరగడానికి బాల్యవివాహాలు అవసరమైనట్టే, కళాఖండాలు కావాలని అఘోరించడానికి చెత్త సినిమాలు సాలుకు బోలెడు వస్తూనే

ఉండాలి. నాలాగా బ్రిలియంట్ థింకర్స్ వాటి మీద లెక్చర్ దంచుతూనే ఉండాలి. ఆ చెత్తలో ఓ మోస్తరు వాటికి ప్రయిజులు వస్తూనే ఉండాలి. నాలాటి వాళ్ళు మళ్లీ వాటి మీద లెక్చర్లు దంచుతూనే ఉండాలి. ది సీక్రెట్ ఆఫ్ ప్రోగ్రెస్--దిస్ వరల్డ్--మైడియర్ వెంకటేశం--ఇన్ షార్ట్ ఈజ్ -- ఈజ్ ...."

అవునుగాని, ఒక చిన్నపని చేస్తావూ, నేను ఇందాకట్నించి ఒళ్ళు లాగా ఓరకంట చూస్తున్నా. ఈ ఆర్టికల్‌కి మొదటి పేజీలో ఉన్న పోర్ట్రెయిట్ మన్దే కాదో కనబడి చావటం లేదు. ఈ కళ్ళ జోడు అంచోటి ...... ఔట్‌ఫీల్డ్‌లో కిందని ఆ మడతలు అవీ చూస్తే పంచెలాగే ఉందిగాని, అది కోకన్నా కావచ్చు. దేరారాల్వేస్ టూ పాసిబిలిటీస్, ఎప్పుడూ రెండందాలా అవకాశాలుంటాయి--మొన్న అదేవిఃటా హాలివుడ్ పిక్చర్‌లో లావుపాటి మిలిటరీ వాడన్నట్టు .... అంచేత నువ్వేదో పనున్నట్టు చూడు .... మంది కాదా? ..... పోన్లే ..... యూ మస్ట్ బీ గ్రేస్‌ఫుల్ వెంకటేశం. ఇంకోలా ఉండిందికి వీల్లేపోతే మంచిగానే ఉండమన్నాడు కొంచెం సేపు మరి -- అడుగో మీఅంకులొస్తున్నాడు. స్టోరీ ఎంతవరకైందంటాడు గాబోలు -- డిస్ట్రిబ్యూటర్లకన్నఅన్యాయంగా ఉన్నాడే -- అరే అట్నించలాగే పోతున్నాడే -- అడ్వాన్సు చెపాయించేస్తాననా? అక్కణ్ణించే ఎలా పసిగట్టాడూ! . . . ఇప్పుడు మరి కాపర్స్ లేవే! ఎలా చెప్మా సిగార్స్‌కి -- డామిట్ --

